బైండ్ల కులస్తులను ఎస్సీ-ఏ జాబితాలో చేర్చాలి



మన్సూరాబాద్: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య బహిరంగ విచారణ జరిగింది. బైండ్ల కులాన్ని సామాజిక, ఆర్థికగా, విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనకబడిన కులంగా గుర్తించాలని ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్‌ను బైండ్ల భవనీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎదుల్ల గౌరి శంకర్ ఆధ్వర్యంలో నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 2011 జనాభా గణంకాల ప్రకారం 19వేల జనాభా మాత్రమే బైండ్ల కులస్తుల తప్పుడు లెక్కలు చూపించారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కులగణన సర్వే ప్రకారం 6 లక్షల పైచిలుకు బైండ్ల జనాభా ఉందన్నారు. ఎస్సీ-ఏ జాబితాలో చేర్చి 7 శాతం రిజర్వేషన్లు తగ్గకుండా చూడాలని కోరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల భాస్కర్, శ్రీనివాసారావు, గాలయ్య, ఇంద్రపల్లి సంజీవ, కోశాధికారి ముప్పాళ్ల సుధాకర్, నాయకులు శ్రవణ్, యాదగిరి పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు

సైదాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పరుష పదజాలం వాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యాలు చేసిన ఎమ్మెల్యే కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం ఆయన ఐఎస్‌సదన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. ఒక ప్రైవేట్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కించపరిచేలా వ్యాఖ్యానించడం పద్ధతి కాదన్నారు. పోలీసులు విచారణ చేపట్టి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరిగారి దాస్, కోట్ల లడ్డూ పటేల్, శ్రీరాములు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దివ్యాంగులకు అండగా నిలవాలి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

పుస్తకావిష్కరణలో వక్తలు

దిల్‌సుఖ్‌నగర్: దివ్యాంగ బాలలకు ప్రతి ఒక్కరూ అండగా నిలుస్తూ వారిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం, రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. ఆర్‌కే పురం డివిజన్ పరిధి వాసవికాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో వారు పాల్గొన్నారు. ప్రతిభా వంతులైన స్పెషల్ స్కూల్స్ బాలబాలికలు, ఎస్‌వీవీ వీకే శ్యామల దేవి ఆధ్వర్యంలో సృజనశీల శిక్షణా కేంద్రాలు, బాస్కో సేవా కేంద్రం తరఫున కొనసాగుతున్న ట్యూషన్ సెంటర్స్‌లో భాగమైన పిల్లలందరితో కలిసి జరుపుకునే ఈ వేడుకలకు 'మా మంచి టీచర్' 'ఎదురీత' వంటి ఎన్నో బాలల ప్రియమైన రచనలు, కూర్పులతో బాలల కె.శాంతారావు రాసిన 'పిల్లలతో స్నేహం చేద్దాం రండి పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోసం అనేక కథలు రాసిన శాంతారావును అభినందించారు. దివ్యాంగుల హక్కుల సంరక్షణకు చేయూతనివ్వాలని జిల్లా కోర్టులో దివ్యాగుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించి వైద్యులు, రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నిరకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి రోగులకు నాణ్యతతో సేవలను అందిస్తామన్నారు. ఆస్పత్రిలో కేఎల్లార్ ట్రస్టు నుంచి సీబీపీ యంత్రాన్ని అందించామన్నారు. భవిష్యత్‌లో ఆస్పత్రిలో కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. డయాలసిస్ యంత్రాలు 5 నుంచి 10కి పెంచేందుకు, బ్లడ్ స్టోరేజీ ఫ్రీజర్ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడి సమస్యలను పరిష్కరించి, ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, ఇజ్రాయేల్, కాకి ఈశ్వర్, కూన యాదయ్య, రఘుపతి, కృష్ణనాయక్, రాజునాయక్, బాల్‌రాజ్, రాఘవేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, యాదయ్య, వైద్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించి ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్ల, ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. హాస్టళ్లలో సమస్యలు తలెత్తకుండా వార్డెన్లు ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యనిస్తుందన్నారు. అనంతరం హాస్టళ్ల, మోడల్ స్కూల్‌లో డ్రైనేజీ, వాటర్, లైట్స్, ఫర్నిచర్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు వసతులు కల్పించాని వార్డెన్లు, ఉపాధ్యాయులు కేఎల్లార్‌ను కోరారు.

కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో బుధవారం కుమార్ అధ్యక్షతన కురుమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం, జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ ముఖ్య అతిథులుగా హాజరై గుర్రంగూడ కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుర్రంగూడ అధ్యక్షుడిగా ఆర్ల శ్రీనివాస్ కురుమ, ఉపాధ్యక్షులుగా ఇమ్మిడిబాబు కురుమ, దడిగె నర్సింహా కురుమ, ప్రధాన కార్యదర్శిగా కాటి కుమార్ కురుమ, సహాయ కార్యదర్శులుగా గొరిగె సత్యానారాయణ కురుమ, రావుల భాస్కర్ కురుమ, కోశాధికారిగా ఇమ్మడి మల్లేశ్ కురుమ, సలహాదారులుగా ఆర్ల నర్సింహ, రావుల పోచయ్య, ఆర్ల శంకర్, యాదప్ప, కొమురయ్య, రమేశ్, సత్యనారాయణ, మల్లేశ్, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా జంగయ్య, నాగేశ్, శ్రీకాంత్, నాగేశ్, కృష్ణను ఎన్నుకున్నారు. కురుమ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి పూర్తి సహకారం అందించిన కురుమ సోదరులందరికీ ఆర్ల శ్రీనివాస్ కురుమ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీఎం కప్ టోర్నమెంట్ ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని సిరిపురం యాదయ్య స్మారక స్టేడియంలో బుధవారం సీఎం కప్ టోర్నమెంట్‌ను అధికారులు ప్రారంభించారు. ముఖ్యులుగా బడంగ్‌పేట మున్సిపల్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలు ముఖ్యమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పల్లెల నుంచి ప్రపంచ స్థాయికి ఎదగాలనే మంచి ఉద్దేశంతో సీఎం కప్‌ను మొదలుపెట్టారన్నారు. అనంతరం కబడ్డీ ఆడుతున్న బాలికల జట్టుతో విచ్చేసిన ముఖ్యులు కరచాలనం చేసి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, జెళ్ల రమేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నర్సింగ్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.



సుల్తానాఅల్వాలోని బస్తీ దవాఖానా

బస్తీ దవాఖానాలు..

కొంత మోదం ఖేదం!

- ఓ చోట మెరుగైన వైద్యం.. మరోచోట తెరుచుకోని వైనం
- బైరామల్‌గూడ బస్తీ దవాఖానాకు నుస్తీ
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికుల విజ్ఞప్తి

చంపాపేట: గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో కొన్ని చోట్ల మెరుగైన వైద్య సేవలందుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో అసలు బస్తీ దవఖానాలు ఉన్నాయా.. లేవా అనే దుస్థితి నెలకొంది. పలు దవాఖానాల్లో సిబ్బంది కొరతతో పాటు అన్ని రకాల మందులు లేక అక్కడికొచ్చే వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. చంపాపేట డివిజన్ పరిధిలో సుల్తానాఅల్వా, బైరామల్‌గూడలో రెండు బస్తీ దవాఖానాలు ఉండగా వాటిలో ఒకటి మెరుగైన వైద్య సేవలు అందిస్తుండగా మరొకటి వైద్యులు, సిబ్బంది, మందుల కొరతతో కొంత మోదం ..మరికొంత ఖేదంగా దర్శనమిస్తున్నాయి.

సుల్తానా అల్వా దవాఖానాకు రోగుల తాకిడి..

సుల్తానా అల్వా కాలనీలోని బస్తీ దవాఖానా పరిసరాలలో ముస్లింబస్తీ, అంబేద్కర్‌వాడ, నెహ్రూనగర్, కటకోనికుంట, పోచమ్మగడ్డ, హరిజన, చిలుక బస్తీలు, పలు మురికి వాడల్లో సుమారు 40 వేల మంది ప్రజలు జీవిస్తున్నారు. స్థానికంగా బస్తీదవాఖానా ఏర్పాటు చేసి స్టాఫ్ నర్సు, ఒక మెడికల్ ఆఫీసర్ తోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దవాఖానాలో అన్నిరకాల స్పెషలైజేషన్‌లో వైద్య సేవలతో పాటు సాధారణ మందులు అందుబాటులో ఉండటంతో నిత్యం ఆస్పత్రికి రోగుల తాకిడి ఉంటుంది. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య శాఖ ఈ-సంజీవని యాప్ ద్వారా ఆయా విభాగాలలో నిపుణులైన వైద్యులను ఫోన్ ద్వారా సంప్రదించి రోగులకు సలహాలు, సూచనలు ఇచ్చే టెలీమెడిసిన్ ప్రక్రియను కూడా అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రోగులు సత్ఫలితాలు, సంతృప్తి పొందటంతో దవాఖానాకు ఆదరణ వస్తోంది.

టెలీ మెడిసిన్ ద్వారా అందే సేవలివే..

సోమవారం: డెర్మటాలజీ, మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ, ఆర్థోపెటిక్, పల్మాలజీ, ఫిజియోథెరపీ
మంగళవారం: ఈఎన్‌టీ, ఆస్తమాలజీ, ఎండో క్రైనాలజీ, డెర్మటాలజీ, నెఫ్రాలజీ,
బుధవారం: జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ
గురువారం: పీడియాట్రిక్, జనరల్ సర్జన్, ఫిజియోథెరపీ, ఆర్థోపెటిక్, నెఫ్రాలజీ
శుక్రవారం: గైనకాలజీ, డెర్మటాలజీ, ఆర్థోపెటిక్, నెఫ్రాలజీ
శనివారం: ఆర్థోపెటిక్, ఫిజియోథెరపీ, నెఫ్రాలజీ.



బైరామల్‌గూడ బస్తీ దవాఖానాలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

స్టాఫ్ నర్సే దిక్కు..

ప్రారంభంలో రోగుల నుంచి ఆదరణ పొందిన బైరామల్‌గూడ బస్తీ దవాఖానా ప్రస్తుతం వైద్య నిపుణులు, సిబ్బంది గైర్హాజరు, మందులు కొరతతో అక్కడికి ఎవరూ వెళ్లకపోవంతో వెలవెలబోతున్నాయి. గత కొన్ని నెలలుగా దవాఖానాకు చెందిన మెడికల్ ఆఫీసర్ మెటర్నటీ లీవ్‌లో ఉండటంతో ఆసుపత్రి కార్యకలాపాలన్నీ స్టాఫ్ నర్సే చూస్తుండటంతో దవాఖానాకు వచ్చే రోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. టెలీ మెడిసిన్ మాట దేవుడెరుగు ఇక చలికాలంలో తరచూ వచ్చే జలుబు, దగ్గు, ఆయాసం, వైరల్ ఫీవర్ వంటి పలు అనారోగ్య సమస్యలను కూడా పరీక్షించుకునేందుకు కూడా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

సద్వినియోగం చేసుకోవాలి..



సుల్తానా అల్వా బస్తీ దవాఖానాలో టెలీ మెడిసిన్‌తో పాటు మెరుగైన వైద్య సేవలు కల్పించటం జరిగింది. సామాన్య ప్రజ లు సైతం ఎలాంటి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందుతున్నారు. అన్నికరాల వైద్య పరీక్షలు చేసి 12 గంటల లోపు రిపోర్టులు ఇచ్చి సూచనలు చేస్తున్నాం.

–డా జువేరా, మెడికల్ ఆఫీసర్, సుల్తానా అల్వా బస్తీ దవాఖానా

ఆసుపత్రి సమయం పెంచాలి..



సుల్తానా అల్వాలోని బస్తీ దవాఖానాలోని వైద్య సేవలు బాగున్నాయి. ఖర్చుతో కూడుకున్న ఎలాంటి వైద్య సేవలైనా రక్త నమూనాలు తీసుకుని 24 గంటల్లో రిపోర్టులు అందించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఆసుపత్రి సమయం పెంచితే మరింతా బాగుంటుంది.

– కొండ యాదగిరి, దుర్గానగర్

ఎప్పుడు తెరుస్తారో, మూస్తారో..



అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. చిన్న సమస్యలు తలెత్తినా బైరామల్‌గూడ దవాఖానాలో డాక్టర్లు, సిబ్బంది లేరు. టెలీ మెడిసిన్ సదుపాయాలు అసలే తెలియదు. దవాఖానా ఎప్పుడు తెరుస్తారో వారికే తెలియదు. అప్పుడప్పుడు స్టాఫ్ నర్సు పరీక్షించినా ఇవ్వాల్సిన మందులు ఉండవు. బస్తీ దవాఖానా ఉన్నా నిరుపయోగమే.

–వరలక్ష్మి, నెహ్రూనగర్

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: మలక్‌పేట సలీంనగర్ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలోని హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 వరకు పరీక్షలు నిర్వహిస్తారని మరింతా సమాచారం కోసం 9703235513, 9985631926 నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 23, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 23, బీర రూ. 45, క్యాబేజీ రూ. 16, ఫ్రెంచిబీన్స్ రూ. 23, క్యారట్ రూ. 40, దొండ రూ. 23–28, చిక్కుడు రూ. 40, గోకర రూ. 23, బీట్‌రూట్ రూ. 37, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 35, దోస రూ. 13, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 13, ఉల్లిగడ్డ రూ. 50, చామగడ్డ రూ. 33. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎల్‌బీనగర్: ఇటీవల నియమితులైన ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్‌ఎస్ ట్రస్ట్ సీఈఓ శివశంకర్ లోతేటిని బుధవారం తెలంగాణ రాష్ట్ర మెడికల్, హెల్త్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వలువురు మాట్లాడుతూ.. ఉద్యోగ అభద్రతా భావంతో ఇబ్బంది పడుతున్నామని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శాంతికుమారి, లావణ్యకుమారి, మహమ్మద్ రఫీ, సుభాష్, రాము పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యకర్తల సమావేశంలో మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి మహమూద్ అలీ సూచించారు. అజంపురాలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి సీఎంతో పాటు ఆయన వర్గీయులంతా కేవలం కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అజిత్‌రెడ్డి, ఆజమ్ అలీ, భూమేష్, లాయక్‌అలీ పాల్గొన్నారు.

నేడు సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

చైతన్యపురి: మార్గశిర శుద్ధ ద్వాదశి సందర్భంగా దిల్‌సుక్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బీవీ.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఉదయం 6.50 గంటలకు 108 పుష్పాలతో సువర్ణ పుష్ప అలంకరణ, 7.30కు బాబా వారికి సామూహిక అభిషేకాలు, 8 గంటలకు తులాభారం సాయంత్రం 7.15 కు సాయిబాబా పల్లకి పూజ ఉంటుందన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

నాగోలు: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ (టీబీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జనవరి 26 కొత్తపేట శ్రీనివాస ఫంక్షన్ హాల్లో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో వివాహ పరిచయ వేదికకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణులందరూ జనవరి 5 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాస్కర మూర్తి, రఘునందన్, నాగరాజు, కల్పవల్లి, విట్టల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



దుస్తులు అందజేస్తున్న అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేజ్-3లో తెలంగాణ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు మురుకుంట్ల అరవింద్ శర్మ పాల్గొని క్రైస్తవులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ అంటేనే ఏసు ప్రభును ఆరాధించడం అన్నారు. ఈ వేడుకల్లో ఎ.ఎలీష, ఎస్.జాన్, ఎస్.వసంత్‌కుమార్, ఎస్. విజయ్ కుమార్, తిమోతి బాబు, ప్రభాకర్, కె.రాజు, యం.సంజీవ, గంట డేవిడ్ రాజ్, ఐజాక్ రాజ్ పాల్గొన్నారు.

అవయవదానం



వల్లపు మల్లయ్య (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపారు ఓ రైతు. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన రైతు వల్లపు మల్లయ్య (51) ఈ నెల 1న తన బైక్‌పై వెళ్తుండగా అకస్మాతుగా కిందపడి తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కామినేని ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స అందించిన వైద్యులు ఈ నెల 8న మల్లయ్య బ్రెయిన్‌డెడ్ అయినట్లు ప్రకటించారు. మల్లయ్య భార్య యాదమ్మ, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించడంతో మల్లయ్య లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను దానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు

నాగోలు: రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు గాయపడిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బండ్లగూడకు చెందిన స్వప్న, ఆమె భర్త, కుమారుడు రోహిత్‌తో కలిసి బండ్లగూడ నుంచి నాగోలు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మెట్రో సిటీ హాస్పిటల్ ఎదురుగా పార్కింగ్ చేసిన కారు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన స్వప్న, రోహిత్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నాలాలో పడిపోయిన వ్యక్తిని బయటకు తీస్తున్న స్థానికులు

అధికారుల నిర్లక్ష్యాన్ని ఏమనాలా?

- నత్తనడకన నాలా పనులు
- తరచూ ప్రమాదాలు

లింగోజిగూడ: అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. ప్రమాదమని తెలిసినా పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బాక్స్ డ్రైయిన్ పనులు పూర్తిచేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులతో పాటు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పలు చోట్ల తొలగించిన నాలా స్లాబ్‌లను మళ్లీ వేయకపోడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నామని ఆయా ప్రాంతాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటే జంకుతున్నారు.వీటికి తోడు దుర్వాసన, దోమల బెడదతో కంటిమీద కునుకులేకుండా పోతుందని వాపోతున్నారు.

నెలలు గడుస్తున్నా..

డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నెం -6లో నాలా పనుల్లో భాగంగా స్లాబ్‌లను తొలగించారు.తొలగించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు అటువైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదు. తప్పని పరిస్థితుల్లో స్థానికులే నాలా చుట్టూ కట్టెలతో అడ్డు కట్టారు. టిఫిన్ అమ్ముకునే సత్యనారాయణ రోజులాగే బుధవారం తన ఎక్సెల్ వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు నాలాలో పడిపోయాడు. గాయాలకు గురవ్వడంతో పాటు వాహనం ధ్వంసం, టిఫిన్‌లు అంతా మురుగులో పడిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి నాలా పనులను పూర్తి చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి..

నాలా పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.నాలా పైకప్పు తొలగించి నెలల గడుస్తున్న మళ్లీ వేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలోనూ ఓ వ్యక్తి కాలు జారి నాలాలో పడ్డాడు. వరద ఉధృతి లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

–మోతీలాల్ నాయక్,గ్రీన్‌పార్క్ కాలనీ



గ్రీన్ పార్క్ కాలనీలో కూలుతున్న నాలా